1.20ఎకరాల అక్రమ రిజిస్ట్రేషన్

- తహసీల్దార్ అరెస్ట్
- రిమాండ్‌కు తరలింపు

డీ నరేశ్ (ఫైల్)

చందుర్తి, అక్టోబర్ 19: ఒకరి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని మరొకరికి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన సలేంద్ర మల్లేశానికి గ్రామ శివారులోని సర్వే నంబర్104, 105/అ,105/అ/అ, 105ఉ/అ, 105/ఉలో 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సలేంద్ర లక్ష్మి, సలేంద్ర వేణు కలిసి అప్పటి తహసీల్దార్ డీ నరేశ్ సాయంతో సదరు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే బోయినపల్లి మండలం అనంతపల్లికి సంబంధించిన రిజిష్టర్ డాక్యుమెంట్‌తో చందుర్తి మండలం అనంతపల్లిలో సలేంద్ర మల్లేశం భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నకిలీ రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా చందుర్తి గ్రామీణ బ్యాంకులో రుణం కూడా తీసుకున్నారు. అయితే మల్లేశం లోన్ కోసం గత జూలైలో సమీప బ్యాంకుకు వెళ్లగా, అసలు విషయం తెలిసింది. దీంతో సలేంద్ర మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. నరేశ్ చందుర్తి తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో చందుర్తి మండలం అనంతపల్లి గ్రామం పేరు మీద ఉన్న భూమిలో ధరణి పోర్టల్‌లో తప్పుడు డాక్యుమెంట్లు అప్లోడ్ చేసి మల్లేశం భూమిని సలేంద్ర లక్ష్మి, వేణు పేరుపై పట్టా మార్పిడి చేసినట్లు తేలిందన్నారు. ప్రస్తుత సిరిసిల్ల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నరేష్‌ను శనివారం అరెస్టు చేసి వేములవాడ న్యాయస్థానంలో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నరేశ్ బాధితులు ఎవరైనా ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

బిల్లులు చెల్లించేదాకా పోరాటం

రెండో రోజూ కొనసాగిన మాజీ సర్పంచ్‌ల దీక్షలు


సర్పంచ్‌లు చేపట్టిన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీటీసీలు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 19: పెండింగ్ బిల్లులు చెల్లించేదాకా రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని తాజా మాజీ సర్పంచ్‌లు స్పష్టం చేశారు. ఈ మేరకు తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండో రోజూ కొనసాగాయి. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన దీక్ష శిబిరానికి చందుర్తి, కోనరావుపేట మండలాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలతోపాటు సీపీఎం జిల్లా అధ్యక్షుడు రమేశ్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంలో అంతరార్థం ఏమిటో అర్థం కావడంలేదన్నారు. నిరసనలో తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసఅ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, తాజా మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు గడప శివజ్యోతి, కోశాధికారి వెన్నమనేని గోపాల్‌రావు, జిల్లా కార్యదర్శి పడిగెల రవీందర్ పాల్గొన్నారు.

తిరుపతిలో అధికారులను కలిసిన వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు

గుడి నిర్మాణం పైసలు ల్యాప్స్ కాలేదు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 19: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే కేటీఆర్ అప్పటి టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి సహకారంతో మంజూరు చేయించిన నిధులు ల్యాప్స్ కాలేదని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శనివారం వెల్లడించారు. కొన్ని రోజులుగా కేటీఆర్ మంజూరు చేయించిన డబ్బులు ల్యాప్స్ అయినట్లు అప్పటి నాయకులను తప్పు పడుతూ కొందరు సోషల్‌మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి టీటీడీ అధికారులను కలిసి వివరాలు వెల్లడించారు. టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ.1.80లక్షలకు సంబంధించిన ఫైల్ మనుగడలోనే ఉందని నూతన పాలక మండలి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉందని వారు తెలిపారు. ఇక్కడ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నంది కిషన్, పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ సనుగుల ఈశ్వర్, సందుపట్ల లక్ష్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్ , అక్టోబర్ 19 : రాజన్న ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రాజన్నకు భక్తులు కోడెమొక్కులు చెల్లిచున్నారు. పిల్లా పాపలు సల్లంగా ఉండాలని వేడుకున్నారు. రాజన్నను 8 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. రాజన్నకు సుమారు రూ. 9 లక్షలకుపైగా ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట /సిరిసిల్ల రూరల్/ ముస్తాబాద్/ గంభీరావు పేట/కోనరావుపేట/ రుద్రంగి, అక్టోబర్ 19 : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మార్కెట్‌యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు, నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, పీఏసీఎస్ డైరెక్టర్ కేసీరెడ్డి నర్సరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, నాయకులు చెలుకల తిరుపతి, సామ మోహన్, కొమురె శంకర్, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, శ్రీనివాస్, గండి నారాయణ, గంగారాజం పాల్గొన్నారు. కోనరావుపేట మండలంలోని ధర్మారం, రామన్నపేట గ్రామాల్లో కొలనూర్ సింగిల్ విండో పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ విజయప్రకాశ్ రావు, ఎల్లయ్య పాల్గొన్నారు. గంభీరావుపేట మండ లంలోని దమ్మనపేట లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ ప్రారంభించారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ రామాంజగౌడ్, సీఈవో రాజిరెడ్డి, నేతలు హన్మంతరెడ్డి, కొమిరిశెట్టి తిరుపతి, బాల్‌రెడ్డి ఉన్నారు. ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్‌పర్సన్ తళారి రాణీ నర్సయ్య స్థానిక నా యకులతో కలిసి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, డైరెక్టర్లు మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. సిరిసిల్ల రూరల్ మండలంలోని గోపాలరావుపల్లె, అంకిరెడ్డిపల్లెలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వీ స్వరూప తిరుపతిరెడ్డి, సిరిసిల్ల సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్ గౌడ్ ప్రారంభించారు. ఫ్యాక్స్ వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరేళ్ల నర్సింగంగౌడ్, ప్రవీణ్, లింగాల లభూపతి, రాజిరెడ్డి, పర్శరాం, బాబు, మునిగెల రాజు, సుద్దాల శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ ఉన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామా ల్లో వరిధాన్యం కొనుగోల కేంద్రాలను ఏఎం సీ చైర్మన్ సాబెరా బేగం ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఉచ్చిడి మోహన్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు ఉన్నారు.

మాట్లాడుతున్న ప్రేమలత

ఆరోగ్య సమస్యల్ని నిర్లక్ష్యం చేయద్దు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఆరోగ్య మానసిక సమస్యల్ని నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత సూచించారు. మన అలవాట్లు మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని అందుకే మంచి అలవాట్లు చేసుకోవాలన్నారు. ప్రపంచ మానసిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో విజయాలను సాధిస్తామన్నారు. వృత్తి పరమైన ఒత్తిళ్లున్నప్పటికీ, వృత్తిలో రాణించాలన్న పట్టుదలతో ముందుకు పోతే సమస్యలనేవి రావన్నారు. లైఫ్ స్టయిల్ మార్చుకుంటే ఒత్తిళ్లను దూరం చేసుకోవచ్చని సూచించారు. ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని జయించేందుకు ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. శరీరానికి తగిన విధంగా వ్యాయామం, యోగా అవసరమన్నారు. మానసిక సమస్యలు వచ్చినపుడు వెంటనే నివృత్తి చేసుకోవాలని, అందుకు సైకాలజిస్టును సంప్రదించాలన్నారు. ఒత్తిడీ కలిగినపుడు స్నేహితులు, బంధువులతో, గుడులకు వెళ్లి సరదాగా గడపాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, డాక్టర్లు, వంశీధర్‌గౌడ్, నయీంజా, బార్ అసోసియేషన్ కోశాధికారి బిట్ల విష్ణు, న్యాయవాది ఆడెపు వేణు, మల్లేశ్‌యాదవ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మారం విజయ డెయిరీ నిర్వాహకుల మోసం

- ఒక రైతు భూమి తనఖా పెట్టి పది మందికి రూ.4లక్షల లోన్
- ఇంకా రూ.1.76లక్షల లోన్ ఉండగానే సెంటర్ ఎత్తివేత
- సదరు రైతు భూమి జప్తునకు బ్యాంక్ నోటీసులు
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

బ్యాంక్ ఇచ్చిన నోటీసులను చూపిస్తున్న బాధిత రైతు కుటుంబ సభ్యులు

కోనరావుపేట, అక్టోబర్ 19: ఓ డెయిరీ నిర్వాహకులు ఓ రైతు భూమిని బ్యాంకులో తనఖా పెట్టి మోసం చేసిన ఘటన కోనరావుపేట మండలం ధర్మారంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ధర్మారం గ్రామం లో 2020 సంవత్సరంలో మణికర గ్రూప్ సభ్యులు విజయ డెయిరీ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలోని రైతులు సభ్యులుగా చేరి ప్రతి రోజూ పాలు పోసేవారు. అయితే డెయిరీ నిర్వాహకులు పలు వురు రైతులకు బ్యాంక్‌లో లోన్లు ఇప్పించారు. గ్రామానికి చెందిన రైతు జెగిడి వెంకటరెడ్డి భూమి పత్రాలను కోనరావుపేట కేడీసీసీ బ్యాంక్‌లో తనఖా పెట్టి మరో పది మంది రైతులకు రూ. 4 లక్షల బర్రెల లోన్ ఇప్పించారు. సదరు రైతుల పాల డబ్బులతోనే కొన్నిరోజులు సజావుగా వాయిదాలు చెల్లించారు. ఇంకా రూ. 1.76 లక్షల బాకీ ఉండి పోయింది. అయితే రెండున్నరేండ్ల క్రితమే నిర్వాహకులు సెంటర్‌ను ఎత్తేశారు. ఈ క్రమంలో లోన్ చెల్లించాలని కోరుతూ డెయిరీ నిర్వాహకులతో పాటు లోన్ తీసుకున్న పది మంది రైతుల చుట్టూ వెంకట్‌రెడ్డి తిరుగుతున్నా పట్టించుకోకుండా చేతులెత్తేశారు. దీంతో చేసేదేమి లేక జరిగిన మోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో మీడియాతో తన గోడు వెల్లబోసుకున్నాడు. శనివారం బ్యాంక్ అధికారులు ఇంటికి వచ్చి వచ్చే నెల 6వ తేదీలోపు లోన్ చెల్లించకపోతే భూమిని వేలం వేస్తామని చెప్పడంతో వెంకటరెడ్డి ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి లోన్ తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

బ్యాంక్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు సహకరించాలి
- బ్యాంకర్లతో డీసీసీడీఎల్ఆర్‌సీ జూన్ త్రైమాసిక సమావేశం

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబర్ 19 : జిల్లాలోని ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువయ్యేలా చూడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన డీసీసీడీఎల్ఆర్‌సీ జూన్ త్రైమాసిక సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న జనాభాకు అనుగుణంగా బ్యాంకుల సంఖ్య ఉందా పరిశీలించాలని, ప్రజలకు బ్యాంకింగ్ సేవలు చేరువ చేసే దిశగా మన జిల్లాలో ఉన్న రుద్రంగి, మల్యాల, నిజామాబాద్ గ్రామంలో నూతన బ్యాంక్‌లు అవకాశం మేరకు ఏర్పాటు చేయాలని, రానున్న 3 మాసాల్లో జిల్లాలోని యువతీ యువకులకు స్వయం ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందేలా పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి సుమారు 1000 మందికి రుణాలు అందజేయాలని కోరారు. రుద్రంగి, మల్యాల, నిజామాబాద్ గ్రామాల్లో మంచి జనాభా ఉందని, అక్కడ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తే ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణాలు తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల మంజూరు సకాలంలో చేయాలని తెలిపారు. వేములవాడ దేవాలయం దగ్గర చిన్న చిన్న దుకాణాలు, వ్యాపారాలు నడిపే వ్యక్తులు బయట 3 శాతం, 5 శాతం వడ్డీలకు వ్యాపార నిమిత్తం అప్పులు తీసుకుంటున్నారని, వారిని గుర్తించి పీఏం స్వానిధి క్రింద రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు సూచించారు. రుద్రంగిలో కెనరా బ్యాంక్, మల్యాలలో యుబిఐ, నిజామాబాద్ గ్రామాలలో ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయవలసిందిగా ప్రతిపాదించగా, దానికి బ్యాంకర్లు సుముఖత వ్యక్తం చేసి వారి హెడ్ ఆఫీస్ పర్మిషన్ తీసుకొని త్వరలో బ్యాంకులు ప్రారంభిస్తామని తెలిపారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత పెంచే దిశగా బ్యాంకర్లు విస్తృతంగా క్యాంపులు నిర్వహించాలని అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో పంట రుణాల కింద 2024-25 సంవత్సరానికి 77,425 ఖాతాలకు రూ.1519 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, జూన్ చివరి నాటికి 14,476 ఖాతాలకు రూ.201 కోట్లు మాత్రమే పంపిణీ చేయడం జరిగిందన్నారు. రుణమాఫీ ప్రక్రియ ము గుస్తున్నందున రుణాల రెన్యువల్ పూర్తి చేసి నిర్దేశిత లక్ష్యాన్ని సాధన దిశగా కృషి చేయాలన్నారు. వ్యవసాయ టర్మ్ రుణ లక్ష్యం రూ. 421 కోట్లకు గాను రూ.135 కోట్లు మాత్రమే అందజేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ బ్యాంకులు వ్యవసాయ టైం రుణ లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలన్నారు. కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీ బ్యాంకు వ్యవసాయ టర్మ్ రుణ లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, ఆర్‌బీఐఎల్‌డీవో సాయి తేజ రెడ్డి, నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, యూబీఐ, డీజీఎం అప ర్ణ రెడ్డి, వివిధ బ్యాంక్ కంట్రోలర్లు, మేనేజర్లు, సంబంధిత జిల్లా అధికారులున్నారు.

మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి

- మందులు లేక ప్రైవేట్ దవాఖానను ఆశ్రయిస్తున్న రోగులు
- సిబ్బంది తీరులపై బీఆర్ఎస్ నాయకుల నిరసన

వైద్యురాలితో మాట్లాడుతున్న నాయకులు

ముస్తాబాద్, అక్టోబర్ 20 : సర్కారు దవాఖానలో పేదలకు మెరుగైన వైద్యమందించాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎం మనోహర్ డిమాండ్ చేశారు. దవాఖానలో మందులు లేక పేదలకు ప్రాథమిక వైద్యమందని దుస్థితి ఏర్పడిందన్నారు. మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు లేవని, పూర్తి స్థాయిలో సిబ్బంది లేక ప్రజలకు సరైన వైద్యం అందడంలేదంటున్న విమర్శలపై శనివారం బీఆర్ఎస్ యూత్ సభ్యులు దవాఖానను పరిశీలించారు. కనీసం బీపీ, షుగర్ టాబ్లెట్లు, దగ్గు సిరప్, తదితర మందులు కూడా లేని దయనీయ పరిస్థితిపై మండల వైద్యాధికారిణి గీతాంజలితో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దవాఖానలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచారన్నారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి ప్రభుత్వ దవాఖానలపై దృష్టి పెట్టాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు బీఆర్ఎస్ యూత్ సభ్యులు సిద్ధమవుతుందన్నారు. పేదల వైద్యంపై సర్కార్ నిర్లక్ష్యం వీడాలని దవాఖానల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి మందుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ దవాకాన ఎదుట నిరసన తెలిపారు. నాయకులు ఆది శేఖర్, కిట్టు, బాధవేణి మహేశ్, ఎండీ జహంగీర్, నరేంద్రాచారి, బండా గణేశ్, ఈస ప్రశాంత్, బండారి అనిల్ పాల్గొన్నారు.

నేటి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ముస్తాబాద్, అక్టోబర్ 20 : రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఎగగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు (రేపు 21న) ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, యూత్ ,విద్యార్థి నాయకులు, మహిళా నాయకురాలు బీఆర్ఎస్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజన్న నిత్యాన్నదాన సత్రానికి విరాళం అందజేత

వేములవాడ టౌన్, అక్టోబర్ 19 : రాజన్న ఆలయ నిత్యాన్నదాన సత్రానికి వేములవాడ వాస్తవ్యులు ఆర్ అలేఖ్య తనకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా తన మొదటి నెల వేతనం రూ. 56 వేలు ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి శనివారం అందజేశారు. ఆమె భర్త ఆశిష్ కుమార్, తల్లిదండ్రులు, ఆలయ విశ్రాంత ఏఈవో ఆగమరావు ఉన్నారు.

సనాతన హిందూ ధర్మాన్ని రక్షించాలి

వేములవాడ రూరల్, అక్టోబర్ 19: రాష్ట్ర ప్రభుత్వం మతోన్మాదులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని హిందూ దర్మాన్ని రక్షించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్‌కు విశ్వ హిందూ పరిషత్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడప కిశోర్, నాగుల రాములు, గౌరిశెట్టి శ్రీనివాస్, హరీశ్, వికాస్, శ్రీనివాస్, రాజేందర్, శ్రీనివాస్, నర్సయ్య ఉన్నారు.

రెండు గ్రామాల్లో డీఎల్‌పీవో విచారణ

బోయనపల్లి, అక్టోబర్ 19 : బోయినపల్లి, నీలోజిపల్లి గ్రామాల్లో శనివారం డీఎల్‌పీవో మచ్చ గీత విచారణ జరిపారు. బోయినపల్లి ఇంటి హద్దు విషయంలో, నీలోజిపల్లిలో ఇంటి నిర్మాణం అనుమతి కోసం పెట్టుకున్న అర్జీలపై విచారణ జరిపారు. ఈ మేరకు డీఎల్‌పీవో ఇరువురి వాదనలు విని రికార్డులను పరిశీలించి స్థానిక కార్యదర్శులను వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విచారణలో ఆమె వెంట ఎంపీడీవో జయశీల, ఎంపీవో శ్రీధర్, కార్యదర్శులు రాజశేఖర్, స్వప్న ఉన్నారు.

లాంగ్ జంప్‌లో సత్తా చాటిన సంపత్

ముస్తాబాద్, అక్టోబర్ 19: జిల్లా స్థాయిలో జరిగిన లాంగ్ జంప్ అండర్ - 17లో మండలంలోని పోతుగల్ బాలుర ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం రాధాకిషన్ రావు తెలిపారు. బహుమతి పొందిన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది శనివారం అభినందించారు.

కేసుల్లో శిక్షల శాతం పెంచాలి : ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, అక్టోబర్ 19 : ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేసి కేసుల్లో శిక్షల శాతం పెంచాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఫిర్యాదు స్వీకరణ నుంచి కేసు నమోదు చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని పరిశోధన చేసి, ఫైనల్ చేసి కోర్టులో నిందితుకు శిక్షలుపడేలా అధికారులు కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులపై పోలీస్ అధికారులు ప్రత్యేక చోరువతో కేసుల్లో పురోగతి సాధిస్తూ, కేసులు త్వరగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో హిస్టరీ రౌడీ షీటర్స్‌పై ప్రత్యేక నిఘా ఏరాపటు చేసి, కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామల్లో, పట్టాణాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి ఉత్తమ ప్రతిభ చూపిన 20 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా ప్రోత్సాహకాలు అందజేశారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది ఉన్నారు.

ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కో ఆర్డినేటర్‌గా రాములు

వేములవాడ టౌన్, అక్టోబర్ 19 : ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కో ఆర్డినేటర్‌గా బొడ్డు రాములు ఎన్నికైనట్లు నియామక పత్రాన్ని రాష్ట్ర కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ పోశెట్టి అందజేశారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో కళాకారుల విభాగం జిల్లా అధ్యక్షుడు వారాల దేవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు.. ఈ నియామకపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాములుకు కళాకారులు అభినందనలు తెలియజేశారు. గుమ్మడి రాజేశం, కనపర్తి హన్మాండ్లు, బుర్రి శంకరయ్య, మొగిళోజి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

గ్రూప్-1 అభ్య